# కొత్త నాన్న

నిలువు టద్దంముందు నుంచుని, సరికొత్త ఫాషన్ ముడి వడి నెత్తిన బాగా కుదిరిందో లేదో అని, అటూ యిటూ తల తిప్పి చూసుకుంటున్న సుహాసినికి వెనకగా ఆమె ఏడేళ్ళ కొడుకు రామూ తచ్చాడుతుండటం కంటబడింది. అప్పటిదాకా వీధిలో పిల్లలతో ఆడుకుని ఒళ్ళంతా దుమ్ము కొట్టుకొని వాడప్పుడే ఇంట్లో కొచ్చాడు.

"ఎక్కడికమ్మా వెళ్తున్నావ్?" అంటూ రాము తల్లి పక్కగా వచ్చి నిలబడి, ఆమె ముఖంలోకి దీనంగా చూశాడు. ఆ పసివాడి చూపులు సుహాసిని హృదయానికి వాడిగా గుచ్చుకున్నాయి. కొడుకును ఆ క్షణంలో ఎత్తుకొని "ఎక్కడికీ వెళ్ళటంలేదు బాబూ. నిన్ను వదిలి ఎక్కడకూ వెళ్ళను" అనాలనిపించింది, ఆమెకు. కాని అనలేక పోయింది. కనీసం ఒక్కసారి ఎత్తుకోవాలని పించింది. కాని టిప్ టాప్‌గా చేసుకున్న అలంకరణ ఆమెను అదీ చెయ్యనిచ్చింది కాదు.

సుహాసిని ప్రేమగా కొడుకు కళ్ళమీద పడుతున్న జుట్టును పైకి సవరించ సాగింది. రామూ తల్లి కట్టుకున్న బెనారస్ చీర కొంగును గట్టిగా గుప్పెట బిగించి పట్టుకొని అటూ ఇటూ మెలివెయ్య సాగాడు.

"నేనూ వస్తానమ్మా!" అన్నాడు రామూ గారాం చేస్తూ తల్లికి మరి కొంచెం దగ్గరగా జరిగి.

"అలాగే బాబూ" అనాలని పించి కూడా అనలేక పోయింది సుహాసిని. రామూ జుట్టును సవరిస్తున్న చేతి వ్రేళ్ళు కొంచెంగా కంపించాయి. ఆమె ప్రక్కగదికేసి తల తిప్పింది. రామూ తన పెద్ద కళ్ళను మరి కొంచెం పెద్దవి చేస్తూ తల్లి జవాబు కోసం ఆదుర్దాగా ఆమె ముఖంలోకి చూస్తున్నాడు.

"ఏమిట్రా గాడిదా? ఆ మట్టి చేతులతో అమ్మ చీర పట్టుకొని అలా గుంజుతున్నావ్!" పక్క గదిలోనుంచి నెక్టై బిగించుకుంటూ బయటకు వస్తున్న లక్ష్మీపతి కస్సుమన్నాడు తల్లీ కొడుకుల వాలకం చూసి.

పులిని చూసినట్లు బెదిరిపోయిన పసివాడు తల్లినుంచి ఒక్కసారిగా దూరంగా జరిగి గోడమూలగా నిల్చున్నాడు. బిక్క బిక్కుమంటూ తల్లివైపూ లక్ష్మీపతివైపూ మార్చి మార్చి చూస్తున్నాడు రాము.

"వాడు అసలే గాడిద. వాడికి బుద్ధిలేదు. నీకైనా వుండొద్దూ? చూడు ఆ కొంగు ఎలా నలిపేశాడో! మనం వెళ్ళేది అణాకానీగాళ్ళ పార్టీ అనుకున్నావా? ఎలాంటి వాళ్ళు వస్తారో, ఎంత నీటుగా డ్రస్ అయివస్తారో నీకేం తెలుస్తుందిలే" అన్నాడు లక్ష్మీపతి వ్యగ్యం ధ్వనించే స్వరంతో.

సుహాసిని ముఖం చిన్నబుచ్చుకుంది. ఆమె జవాబు ఇవ్వలేదు. ఆమెదృష్టి బిక్కు బిక్కుమంటూ చూస్తూ

నిల్చున్న రామూమీద పడింది. గుండెలు తరుక్కు-పోయాయి.

"ఏమండీ! రామూనుకూడా టీపార్టీకి తీసుకెళదాం" అన్నది. మాటలుకాస్త తడబడినై.

లక్ష్మీపతి తారాజువ్వలా లేచాడు. "నీకేమైనా జ్ఞానం అంటూ వుందా? వాణ్ణి టీ పార్టీకి తీసుకెళదాం అంటావేమిటి? అక్కడ ఎవరన్నా ఆ కుర్రాడెవరూ అంటే ఏం చెప్ప మన్నావ్?" గద్దించాడు లక్ష్మీపతి.

సుహాసిని తలవంచుకుంది.

"నా పెళ్ళాం తాలూకు మొదటి మొగుడు కొడుకూ అని చెప్ప మంటావు గదూ" లక్ష్మీపతి స్వరంలోని హేళనకు సుహాసిని కళ్ళలో గిర్రున నీరు తిరిగింది, కాని జవాబివ్వ లేదు. బీరువా తాళం వెయ్యసాగింది.

"అందుకే ఈ గాడిదను ఏ అనాథ ఆశ్రమంలోనో పడెయ్యమని మొత్తుకుంటున్నాను" రామూ వైపుకు తిరిగింది లక్ష్మీపతి కోపం.

చేతిలో తాళాలు కింద పడ్డాయి.

"మీకు పుణ్యం వుంటుంది. ఆ పని మాత్రం చెయ్యకండి" అంది సుహాసిని గొంతులోనే చుట్టుకు పోతున్న మాటల్ని బలవంతంగా బైటకు నెడుతున్నట్లు. "నువ్వు ఇలాగే అంటూ వుండు. ఒకనాటికి ఆ పని చేసి తీరతాను. ఆ గాడిదను చూస్తుంటే అసలే నాకు వళ్ళు మండి పోతుంది. నువ్వు మరో మొగుడితో దాదాపు ఆరేళ్ళు కాపరం చేసినట్లు ప్రతి

నిముషం గుర్తు చేసి, అసహ్యం కలిగించడానికి వీడొకడు దాపరించాడు నా ప్రాణానికి."

సుహాసిని లక్ష్మీపతి ముఖంలోకి ఓ క్షణం నిశ్చలంగా చూసింది. "మరి నా కెలా వుంటుంది? రెండు నెలల క్రితం కూడా నీకు ఓ కొడుకు పుట్టాడే? వంశోద్ధారకుడు పుట్టాడని నా దగ్గరే సిగ్గులేకుండా మురిసిపోయావే?" అని అనాలనిపించింది సుహాసినికి. కాని అనలేకపోయింది. దానికి అతని నుంచి ఎంత మొరటు జవాబు రాగలదో తనకు తెలుసు. అతను మగవాడు. అతను ఏమైనా చేయవచ్చును. తను ఆడది సమాజం దృష్టిలో తను పతిత. ఎవరికోసం తను ఈ ఊబిలో కాలు వేసిందో అతని దృష్టిలో కూడా తనకు పెద్ద స్థానం ఏమీ లేదు.

"ఆలోచించావులే ఇక బయలుదేరు! ఒరేయ్ గాడిదా ఎందుకురా అలా మూలనక్కావు? పద బయటకు!" గర్జించాడు లక్ష్మీపతి.

సుహాసిని యాంత్రికంగా రామూ వైపుకు నడిచింది. "వీధిలోకెళ్ళి నగేష్ వాళ్ళతో ఆడుకో బాబూ. నేను తొరగా వచ్చేస్తాగా. రేపు పండక్కి కాల్చుకోనేందుకు మతాబులూ అవీ యిన్నీ పట్టుకొస్తాను. సరేనా?" అన్నది సుహాసిని చిన్న గొంతుతో. రామూ నొసటిమీద పడుతున్న జుట్టును పైకి సర్దింది.

మతాబాలపేరు వినగానే రామూ కళ్ళముందు రంగు రంగుల మతాబాల వెలుగు కనిపించి, ముఖం సంతో

పంతో వెలిగిపోయింది. ఆ పెద్దకళ్ళలో కాంతిరేఖలు కదిలాయి.

"అమ్మా! మరేమో? నాగేష్‌వాళ్ళు నిన్నట్నించీ టపాకాయలూ, కాకర పువ్వొత్తులూ కాలుస్తున్నారమ్మా. నా కొక్కటికూడా అడిగితే ఇవ్వలేదు" అన్నాడు రాము ముఖం మీద పడుతున్న జుట్టును వెనక్కు తోసుకుంటూ ఉత్సాహంగా.

"ఏడ్చావ్! వెధవా! బయటికిపో! నీ గారాలూ నువ్వూను!" అంటూ లక్ష్మీపతి పగబట్టిన పాములా బుస కొట్టాడు.

రామూ బెదురు బెదురుగా తల్లి ముఖంలోకి ఒకసారి చూసి బయటకు వెళ్ళాడు. సుహాసిని గట్టిగా నిట్టూర్చింది.

అది చూసిన లక్ష్మీపతికి వళ్ళుమండింది. "ఒసే ఏమంత కష్టంవచ్చింది. చాలా పెద్దపెద్ద ఊపిర్లు తీస్తున్నావ్!" అన్నాడు హేళనగా. సుహాసిని జవాబివ్వలేదు. లక్ష్మీపతి గడప దాటగానే తలుపుకు తాళంవేసి, వీధివార నిలబడి వున్న టాక్సీలోకి వెళ్ళి కూర్చున్నది, సుహాసిని చిన్నబుచ్చుకున్న ముఖంతో.

రామూ తన పెద్దకళ్ళలో భయం, దీనత్వం తొణికిసలాడుతోండగా, తల్లి కేసీ, లక్ష్మీపతి కేసీ చూడసాగాడు. లక్ష్మీపతికూడా టాక్సీఎక్కి చిరాగ్గానే సుహాసిని పక్కన కూర్చున్నాడు. ఇంజెన్ స్టార్టుచేశాడు డ్రయివర్. తీరా టాక్సీ కదలబోతుంటే టపాకాయలగురించి తల్లికి మరోసారి జ్ఞాపకం చెయ్యటానికి రామూ రెండడుగులు ముందుకు

వేశాడు. "ఏరా గాడిదా! టాక్సీ కిందపడి చావాలనివుందా ? ఫో దూరంగా?" కసురుకున్నాడు లక్ష్మీపతి.

ఆ మాటలకు ఉలిక్కిపడి పక్కకు తప్పుకున్న రాముాతో మళ్ళీ అన్నాడు లక్ష్మీపతి. "ఒరేయ్! ఎక్కడికీ వెళ్ళక యిక్కడే గడపలమీద కూర్చో. రోజులు బాగా లేవు. ఎవరైనా తాళం బద్దలుకొట్టి కొంపలో జొరబడగలరు తెలిసిందా! ఆ వీధికీ ఈ వీధికీ పోయావో చర్మం వలి చేస్తాను జాగ్రత్త" అన్నాడు లక్ష్మీపతి.

"మా బాబువుగదూ. ఎక్కడికీ పోమాకు. ఇక్కడే కూచో. అంత భయమైతే నాగేష్‌ను తోడుతెచ్చుకో. తొరగా వచ్చేస్తాగా" అన్నది సుహాసిని, ఆమెమాటలు స్టార్టయిన టాక్సీ రొదలో కలిసిపోయాయి.

రామూ వేగంగాపోతున్న టాక్సీకేసి చూస్తూ కొంత సేపు నిలబడి, అది వీధిమలుపు తిరిగి కనపడకుండా పోగానే, గడపల దగ్గిర మెట్లమీద కూర్చున్నాడు. అంతవరకూ బల వంతంగా కనిగుడ్లలోనే నిలుపుకొన్న కన్నీరు కట్టలు తెంచుకొని ఆ మున్నని పసిడి బుగ్గలమీదుగా కారుతూ, కింద పెదవీ గడ్డానికీ మధ్యవున్న గుంటలో, అందమైన ముఖాన్ని విడవటం ఇష్టంలేనట్లు ఓ క్షణంఆగి కిందకు జారి చొక్కాను గుండెలుమీద తడుపుతూంది.

నాగేష్ వాళ్ళ అమ్మ పార్వతి అత్తయ్యా, ఇంకెవరో రావటం రామూచూసి తలవంచుకుని చొక్కాతో కళ్ళ నీళ్ళు గబగబా తుడుచుకోసాగాడు.

పార్వతి "ఏం, బాబూ ఏడుస్తున్నావెందుకు ?" అంటూ పసివాణ్ణి దగ్గరకు తీసుకుంది. ఆ ఆదరణ రామూ హృదయాన్ని చల్లని వెన్నెలలా తాకింది. దుఃఖ సముద్రం కట్టలు తెంచుకుంది. బావురుమని ఏడ్చాడు.

"ఎందుకూ ఏడుస్తావ్ ! ఊరుకో బాబూ ! అమ్మ కొట్టిందా? అరే తాళంవేసి ఎక్కడికో వెళ్ళినట్లుందే ? ఏడవకు త్వరగానే వచ్చేస్తుందిలే" అంటూ పార్వతి పైట చెంగుతో రామూ కళ్ళు తుడిచింది.

రామూ కళ్ళనీళ్ళు ఆగినా ఇంకా వెక్కిళ్ళు ఆగలేదు. రామూను లేపి నిలబెడుతూ "అమ్మ వచ్చేంతవరకూ మా ఇంటికిపోదాం రా, నాగేష్‌కు జ్వరంవచ్చి పడుకొని వున్నాడు" అంది పార్వతి రామూను జాలిగా దగ్గరకు తీసుకొంటూ.

"కొత్తనాన్న ఇక్కడే కూచోమన్నాడు. ఎటన్నా పోతే చర్మం వలిచేస్తానన్నాడు" అని అన్నాడు. వెక్కిళ్ళ మధ్య మాటలు తడబడినై. తిరిగి రామూ గడపలమీదే చతికిల బడ్డాడు.

పార్వతి వెంటవున్న ఆవిడ ఆశ్చర్యంగా అడిగింది. "కొత్తనాన్న ఏమిటే?" అని.

"చెబుతాలే తరవాత. ఏడవకు బాబూ ! మీ అమ్మ ఇప్పుడే వచ్చేస్తుందిలే" అంటూ పార్వతి రామూ బుగ్గల మీద చారికలు కట్టిన కన్నీటిని తుడిచి బయలుదేరింది.

కొంతదూరం నడిచి, ఏదిమలుపు తిరుగుతూ పార్వతి,

జానకి వెనక్కు తిరిగిచూశారు. రామూ దిగాలుగా వాళ్ళ వైపే చూడడం కనిపించింది. పార్వతి నిట్టూర్చింది.

"ఎవరే ఆ కుర్రాడు పార్వతీ! లక్కపిడతలా నోరూ, చంద్రబింబంలా ముఖం ఎంత ముద్దువస్తున్నాడో? ఎంత తెలివైన కళ్ళో, చాలా గొప్పవాడయ్యే లక్షణాలు వున్నాయి ముఖంలో అన్నది జానకి.

"ఏం? తల్లి సరిగాచూడదా? మర్చిపోయాను కొత్త నాన్నంటాడేమిటి?" అడిగింది జానకి కుతూహలంగా.

"అదంతా ఓ పెద్దకథ, చూస్తుంటే కొందరి జీవితాలు కథలంత చిత్రంగానూ వుంటాయి. ఈ రామూతల్లికి ఎంతలేదన్నా ముప్పయ్ ఏళ్ళువుంటాయి. చాలా అందమైన మనిషి. అందానికి పేరుమోసిన సినీమాతారలు ఆవిడముందు బలాదూరనుకో. అందం కొందరి పాలి టవరం అయితే మరి కొందరికి శాపంలా పరిణమిస్తుంది. ఈ సుహాసిని ... అదే రామూతల్లి ... అందంతోపాటు అందమైన కోర్కెల్నీ, ఆశల్నీ వయస్సుతోపాటు పెంచుకుంటూ వుండి వుంటుంది. కాని అవి తీరే అంతస్థుగల కుటుంబం కాదు వాళ్ళది.చాలా బీదవాళ్ళు. నలుగురు ఆడపిల్లల్లో ఈ సుహాసినే పెద్దదిట. ఈ రోజుల్లో అందంచూసి పెళ్ళాడే వారెవరు కట్నం లేకుండా? తల్లి దండ్రులు ఉన్నదాంట్లోనే కాస్త ముట్టజెప్పి కామేశ్వ్రావనే అతడికిచ్చి పెళ్ళిచేశారు.మనిషి చాలా మంచివాడు. అందరూ అతణ్ణి ధర్మరాజు అనేవారు. లోకంలో ధర్మరాజులు చేయగలిగిందీ, చేసేదీ ఏదీ లేదేమోననిపిస్తుంది. ఏ అర్జునుడిలాటి తమ్ముడిఅండ దొరికితేనో తప్ప. స్కూల్

ఫైనల్ వరకూ చదివిన కామేశ్వరరావు ఫారెస్టు డిపార్టు మెంటులో ఎల్. డి గుమస్తాగా పని చేసేవాడు. ఈ కాలనీలో అందరితోపాటు అతనికీ ఇల్లు ఇచ్చారు. ఆ తరవాత ఉన్నవాళ్ళకే ఈ ఇళ్ళన్నీ అమ్మేశారు. ఎందుకులే పోనిద్దూ చెప్పాలంటే చాలావుంది" అంది పార్వతి.

"ఫర్వాలేదు. చెప్పు. నాకు వినే ఓపికవుందిలే." అంది జానకి కుతూహలంగా.

"మొదట మొదట సుహాసినితో నాకు బాగానే పరిచయం ఏర్పడింది. ఇప్పుడు దాని ముఖంకూడా చూడ నన్నుకో."

"అసలు ఇంతకూ సుహాసిని చేసిన అంత అపరాధం ఏమిటో త్వరగా చెప్పు!" అంది జానకి.

"మహాపరాధమే చేసింది. ఏ పరువుగల ఆడదీ చెయ్యరాని పనే చేసింది.మనస్సులో పెంచుకున్న కోర్కెలు తీరకా _ తన అందానికి తగినవాడు దొరకలేదన్న అసంతృప్తి క్రమంగా ఆమెలో పెరిగి వుండవచ్చు. పెళ్ళయిన రెండో ఏడే ఈ రాముూ పుట్టాడు. భర్తను నానా హింసలూ పెడుతుందనీ, ఈ మధ్య ఆమె ప్రవర్తనకూడా అంత బాగాలేదనీ నలుగురూ చెప్పుకోసాగారు. మొదట నేను నమ్మలేదు. కాని చివర చివరకు ఆమె ప్రవర్తన నాకు నచ్చలేదు. అంతతో ఆమెతో మాట్లాటం మానేశాను. లక్ష్మీపతి అనేవాడు, కామేశ్వరరావు స్నేహితుడేనట. ఎప్పుడూ ఇంట్లోనేపడి వుండేవాడు. ఒకరోజు హఠాత్తుగా కామేశ్వరరావు ఇంట్లోనుంచి వెళ్ళిపోయాడని,

కాదు, భార్య వెళ్ళగొట్టిందనీ...అనుకున్నారు. ఆ తరువాత లక్ష్మీపతి...అంటే రాముా కొత్తనాన్న...పూర్తిగా ఇక్కడే తిష్ఠవేశాడు. ఇద్దరూ పబ్లిక్‌గా తిరగటంకూడా మొదలు పెట్టారు. అతను ఏదో ఫిలిం డిస్ట్రిబ్యూటింగ్ కంపెనీలో మంచి ఉద్యోగమే చేస్తున్నాడట. బాగా డబ్బువున్నవాడట” అన్నది పార్వతి.

“అంటే ఇద్దరూ పెళ్ళిచేసుకున్నారేమో” అంది జానకి.

“పెళ్ళీ! అతడికి నలుగురు పిల్లలూ, పెళ్ళాంవున్నారు. పెళ్ళాం బిడ్డలంటే మహా ప్రేమట. ఇది కేవలం ఫస్తు కాల క్షేపం మాత్రమే, ఆవిడ అందం కాస్త తిరుగుముఖం పట్టిన రోజున చల్లగా తప్పుకుంటాడు, నాకు తెలుసు, ఇలాటి వాళ్ళని చాలామందిని చూశాను.”

“ఆ కామేశ్వర్రావేమయ్యాడో ?” అన్నది సాలోచనగా.

“పెళ్ళాం ఇంట్లోనుంచి గెంటేసిన తరవాత ఎక్కడుండేవాడో తెలియదుకాని, ఆఫీసుకుమాత్రం ఓ నెలరోజుల పాటు హాజరయాడట. పని సక్రమంగా చేసేవాడు కాదనీ, నవ్వటం, పిచ్చిగా ఏదో మాట్లాడుతూండటం చేసేవాడనీ చెపుతారు. ఆ తరవాత ఆఫీసుకు రావటమే మానేశాడట. అతడికి పూర్తిగా పిచ్చెక్కిందనీ, చార్మినార్ ప్రాంతంలో తిరుగుతూంటే చూశామనీ కొందరు అంటారు. ఆ మెయిన్ రోడ్డు అవతల గుడిశలు కనిపిస్తున్నాయ్ చూశావ్! అక్కడే వినాయకుడి గుడికూడా వుంది. అక్కడ రాముా ఇతర పిల్ల

లతో కలసి ఆడుకుంటూ వుంటే, దూరంగా చెట్లకిందగా నిలబడి కొడుకు వేపుకే చూస్తున్న కామేశ్వరరావును చాలా మంది చూశామని చెబుతుంటారు. మనిషి గుర్తుపట్టటానికి వీలులేనంతగా మారిపోయాడట. చీలికలూ పీలికలూ అయి శరీరంమీద వేలాడుతున్న మురికి గుడ్డలూ, పెరిగిన గడ్డం, పిచ్చిచూపు బాగా బక్కచిక్కిపోయి వున్నాడని చెప్పగా విన్నాను. ఏదో సమయం చూసి కొడుకుని కాస్త భుజాన వేసుకుపోతాడేమోనని నా భయం. ఆ కనపడే గుట్టలూ, మెట్టలూ వెనుక పాడుపడిన నవాబు దివాణం ఒకటి వుందిలే. అందులోనే వుంటుంటాడని మా పనిమనిషి చెబుతూ వుంటుంది. ఆ లక్ష్మీపతినే రామూ కొత్తనాన్న అంటాడు. లక్ష్మీపతి రామూ పాలిట రాక్షసుడే అయ్యాడు. చీటికి మాటికి చీరేస్తుంటాడట. ఆ భామ గుడ్లు మిటకరించుకొని చూస్తూ కూర్చుంటుందట" అన్నది పార్వతి.

"ఆవిడకు లక్ష్మీపతి అంటే అంతభయం అన్నమాట" అన్నది జానకి ఆలోచిస్తూ.

"దానికి ఇప్పుడు బిడ్డలు కావాల్సి వచ్చారా. దానికి కావాల్సింది..."

జానకి మధ్యలోనే అందుకుంది. "ఆవిడ మానవత్వాన్ని అంత తేలిగ్గా కొట్టేయకు. కన్నతల్లి హృదయం ఎంత విలవిల్లాడిపోతోందో!"

"నువ్వు దాన్నిచూసి జాలిపడుతున్నావా? కట్టుకున్న మొగుణ్ణి తరిమేసి కొడుకు భవిష్యత్తు గురించయినా

ఆలోచించకుండా తమ పోకులకోసం...వంట్లో కొవ్వు కాక పోతే ఇట్లా చేస్తుందా? కన్నబిడ్డకంటే ఆ లక్ష్మీపతి దానికి ఎక్కువయ్యాడా! వాణ్ని అలా చంపుకుతింటూంటే చూస్తూ వూరుకుంటుందా? ఇవ్వాళ చూడు, ఇద్దరూ ఆ పసివాణ్ని వదిలేసి ఊళ్ళో ఊరేగబోయారు. దాని వేషం చూడాల్సింది నువ్వు" అంది పార్వతి ఏవగింపుగా.

"ఆవిడ జీవితంలో ఇలాంటి తప్పటడుగు వెయ్యటానికి కారణాలు— పూర్వాపరాలు తెలుసుకోకుండా రాళ్ళురువ్వటం వివేకం అనిపించుకోదు పార్వతీ! ఒకసారి అజ్ఞానంవల్ల నే నసుకో ఊబిలో కాలువేసింది. ఆ తరవాత బయట పడటం కష్టం. నిముష నిముషానికీ ఆ ఊబి ఆడదాన్ని కుంగదీసే స్తుంది. ఇప్పుడు అతగాణ్ని ఎదిరించి ఆవిడ ఏమవుతుంది? సంఘం దృష్టిలో ఆవిడ ఏనాడో పతితం అయి పోయింది. కన్న తల్లిదండ్రులుకూడా కన్నెత్తి చూడరు. అలాటప్పుడు ఆమెను సంఘం...అంటే...నువ్వూ నేనూ కూడా...బతక నిస్తుందా? కాకపోతే ఇలాటి జీవిత చక్రాలకింద రాముూ లాటి పసిబిడ్డలు, పళ్ళచక్రాలకింద నలిగిపోయే చెరుకుగడల్లా నలిగిపోతున్నారు. అదే నా బాధ" అంటూ నిట్టూర్చింది జానకి.

"కథలురాసేవాళ్ళు అందర్నీ సానుభూతితో చూడాలి కాబోలు! అందులోనూ సాహిత్యానికి ఓ ప్రయోజనాన్ని అంటగట్టాలనే నీలాటివాళ్ళు ముఖ్యంగా. మరి మీారు విమ ర్శించే దెవర్ని! బాగుచేసే దెవర్ని!" అంటూ పార్వతి పక పకా నవ్వేసింది.

జానకి నవ్వటానికి ప్రయత్నించింది. కాని నవ్వలేక పోయింది. రామూ జానకి కళ్ళలో మెదలసాగాడు. జానకి రామూనూ, రామూలాటి కుర్రాళ్ళనూ వాళ్ళ సమస్యల్ని వూహించుకుంటూ మౌనంగా పార్వతి పక్కనే నడవ సాగింది.

*　　　　*　　　　*

మోకాళ్ళమీద మోచేతులు ఆనించి, అరచేతుల్లో గడ్డాన్ని పెట్టుకొని గడపలమీద కూర్చున్న రామూ బుర్రలో రెక్కలు వచ్చీరాని పక్షిపిల్లల్లా ఆలోచనలు రెప రెపలాడాయి.

"ఛీ! కొత్తనాన్న మంచోడుకాడు. దొంగ, దెయ్యం పిచ్చోడు! అసలేం మంచోడుకాడు. నన్ను గాడిదా గాడిదా అంటాడు! నేను గాడిదలాగున్నానా? మరి నన్ను అందరూ బాగున్నావని ముద్దుపెట్టుకుంటారేం? గాడిదను ఎవరైనా ముద్దుపెట్టుకుంటారా? గాడిద ఎక్కడన్నా మాట్లాడుద్దా! గాడిద చెవులు ఎంత అసహ్యంగా వుంటాయో!" అప్రయత్నం గానే రామూ చేతులు తన చెవులమీదకు వెళ్ళాయి. గులాబీ రేకుల్లా మెత్తగా చెవులు రెండూ వేళ్ళకు తగలగానే ఆ పసి హృదయంలో రేగిన అనుమానం మటుమాయం అయింది.

"కొత్తనాన్న మాటలన్నీ అబద్ధాలే. కొత్తనాన్నే గాడిద. ఏం బాగుండడు. ఒకరోజుకూడా నన్ను బజారుకు తీసుకెళ్ళడు. ఎప్పుడూ గాడిదా గాడిదా అంటాడు. నాకు బలే ఏడుపొస్తుంది" గొణుక్కున్నాడు రాము.

రాముకు దుఃఖం పొర్లుకొచ్చింది. అంతలోనే పాత నాన్న జ్ఞాపకం రాముా హృదయానికి సాయంకాలపు చల్ల గాలిలా తాకింది.

"ఆ నాన్న – పాతనాన్న – ఎంత మంచోడో" అను కున్నాడు రాము. రాముా తెలిసీ తెలియని ఆలోచనలు పాతనాన్నను చుట్టేశాయి.

'మరి ఆ నాన్నేగా తన సొంతనాన్న! రోజూ ఆఫీసు నుంచి ఇంటికి వచ్చేప్పుడు తాయిలం తెచ్చి పెట్టేవాడు. అమ్మకు అప్పుడప్పుడు పూలు తెచ్చేవాడు. అమ్మకు పూలంటే ఇష్టం లేదో ఏమో నాన్నను ఏవేవో తిట్లు తిట్టి పోసేది. ఒకోసారి జుట్టు పీకుతుంటే నాన్నకు–నాకు ఇప్పుడు తన కొచ్చినట్టే ఏడుపు వచ్చేది. తనకు అమ్మమీద బలే కోపం వచ్చేది. తను అలాగే నాన్న వళ్ళో పడుకొని నిద్ర పోయేవాడు! ఎంత మంచి నాన్నో!'

రాముా చొక్కాతో కళ్ళు తుడుచుకొని వీధికేసి ఓ మారు చూశాడు.

'ఆ నాన్న కనపడ్డేం! ఎక్కడకు వెళ్ళాడో! అమ్మే ఆ రోజు బాగా తిట్టిపోసి ఇంట్లోనుంచి వెళ్ళగొట్టింది. ఆ రోజు ఈ కొత్త నాన్న చూస్తూ కూర్చున్నాడు. పాతనాన్న తీసుక వెళ్ళ లేదు. అసలు పాత నాన్నతో తను మాట్లాడడు. ఊఁహుఁ అసలు మాట్లాడడు! ఆ ఊహ రాగానే రాము బుంగ మూతి పెట్టి తల అటూ యిటూ ఆడించాడు.

రాముా అలసటతో కళ్ళు మూసుకున్నాడు, "బాబూ! నా మీద అలిగావా?" అంటూ పాత నాన్న ఎదుట గా నిల్చున్నట్లయి రాముా ఉలిక్కిపడి కళ్ళు తెరిచాడు. ఆశగా నాలుగువైపులా కళ్ళుతిప్పాడు. "ఏడీ ! పాతనాన్న ఇప్పుడేగా వచ్చాడు ? మళ్ళీ ఎక్కడకు పోయాడు ? మళ్ళీ రాడా! దేవుడా మా పాతనాన్నను రప్పించవూ ? వినాయ కుడా! రోడ్డవతల పెద్ద వినాయకుడా! పెద్దదేవుడా! మొన్న వినాయక చవితికి నీకు ఉండ్రాళ్ళు పెట్టానుగదూ ? మరే పాతనాన్న ఇంటికొచ్చేలాగ చెయ్యి ! నువ్వు దేవుడివిగా ! మానాన్న ఎక్కడున్నాడో నీకు తెలుసుగా! తొందరగా రప్పించు! ఈ కొత్త నాన్నకు బాగా దుగ్గి చెల్లాలు పెట్టించాలి మానాన్న చేత. యీ కొత్త నాన్నని బాగా తంతాడు. లేక పోతే నేను గాడిదనా? పాతనాన్న కొత్తనాన్నను బలేతం తాడు. బాగా తంతాడు. చెవులు పట్టుకొని తలకాయవంచి.. యిట్టా- యిట్టా భలే భలే... కొత్త నాన్న బలే ఏడుస్తు న్నాడు-.అంటూ రాము చిన్నగా చప్పట్లు కొడుతూ కొత్త నాన్న ఏడుస్తూ, జారిపోతున్న పంచెను పట్టుకొని వీధిలోకి పారి పోవడం కూడా ఊహా లోకంలో చూస్తూ, ఆనంద పారవశ్యం చెందాడు.

ఎండ పొడ రాముా ముఖంమీద పడింది. కాస్త వెనక్కు జరిగి తలుపుల కానుకూర్చుంటూ వినాయకుడికి మనస్సులోనే మొక్కుకున్నాడు. "దేముడా! వినాయకుడా! మానాన్న వచ్చేలా చెయ్యి! ఆనక అమ్మ తెచ్చే మతా బాలూ, విష్ణు చక్రాలూ, కాకర పువ్వొత్తులూ కొత్తనాన్న

చూడకుండా తెచ్చి... కాసిని నీకూ్కడా ఇస్తాను.” అంత లోనే అసలు అమ్మ టపాకాయలు తెస్తదో లేదోననే అనుమానం కలిగింది రాముకు. “కొత్త నాన్న వద్దంటే మాత్రం అమ్మ ఎందుకు వినాలి? కొత్త నాన్నలాగే అమ్మకూడా మంచిది కాదు. అమ్మ పాతనాన్నను ఒకటే తిట్టిపోసేది. కొత్త నాన్న తిడుతుంటే చూస్తూ కూర్చుంది. అప్పుడప్పుడు ఏడుస్తుంది. కూడా. కొత్త నాన్న కొడితే నాకంటే అమ్మే ఎక్కువ సేపు ఏడుస్తుంది. మరి కొత్తనాన్న అసలుకు నాన్నే కాదు” అనుకున్నాడు రాము కసిగా.

ఈ కొత్త నాన్నను పాత నాన్నే తీసుకొచ్చాడు. ఆ రోజు నాన్న ఈ కొత్తనాన్న తనకు మామయ్య అని చెప్పాడు. తను అట్లాగే పిల్చేవాడు. అప్పుడు బలే ప్రేమగా చూసేవాడు. తనకూ ఎన్నో బొమ్మలూ, కొత్త బట్టలూ తెచ్చి పెట్టేవాడు. అమ్మకు కూడా మంచి మంచి చీరెలు తెచ్చేవాడు. అప్పుడు పాత నాన్న మామయ్య, తెచ్చినవన్నీ తీసుకో వద్దనేవాడు. తనకు నాన్న మీద కోపం వచ్చేది. అప్పుడు నాన్నకంటే మామయ్యే మంచోడుగా వుండేవాడు. అందుకే నాన్నకు కోపం వచ్చి వెళ్ళి పోయాడేమో! అయితే మళ్ళీ రాడ! నాన్న వెళ్ళిపోయాక ఈ కొత్త నాన్నను మావయ్య అంటే కొట్టే వాడు. అమ్మే నాన్న అనమంది. అందుకే తను కొత్త నాన్న అన్నాడు

“ఐస్ క్రిమ్! ఐస్ క్రీమ్” అన్న కేక విన బడి రామూ అటుకేసి తల తిప్పి చూశాడు. వీధి చివర ఐస్ క్రీమ్ బండి తోసుకు వస్తున్నాడు ఐస్ క్రీమ్ అమ్మే కుర్రాడు. వాడికి

పద్నాలుగు పదిహేను ఏళ్ళుంటాయి. అప్పటికే వీధి పిల్లలు కొందరు బండిచుట్టూ చేరి ఐస్‌క్రీమ్ కొనుక్కుంటున్నారు. ఆ దృశ్యం చూడగానే రామూకు నోరూరింది. గడపల మీదనుంచి లేచి పరుగుతీస్తూ జేబులో చెయ్యిపెట్టి చూసు కున్నాడు. ఐదు నయాపైసలబిళ్ళ చేతికి తగలగానే, హృద యాన్ని ఐస్‌క్రీమ్‌తాలూకు చల్లదనం గిలిగిలి తలు పెట్టింది. ఐస్‌క్రీమ్ ఖరీదు ఆరు నయాపైసలు. ఆ సంగతి రామూకు తెలుసు. మరొక నయాపైసా దొరుకుతుందేమోనన్న ఆశతో జేబంతా మరొకసారి కలియజూశాడు. ఉహూఁ! ఐదు నయాపైసల బిళ్ళే వుంది.

రామూ బండిదగ్గరకు వెళ్ళి జంకుతూనే ఐదు నయా పైసలు కుర్రాడిచేతిలో పెట్టాడు. ఐస్‌క్రీమ్ బయటకు తియ్య బోతూ "ఏదీ ఇంకో నయాపైసా!" అన్నాడు బండివాడు రామూకేసి చేయి చూస్తూ.

"లేదు రేపిస్తాను" రామూ ఐస్‌క్రీం కోసం చేతిని చాచాడు.

ఐస్‌క్రీం బండివాడు రామూను నఖశిఖ పర్యంతం దీక్షగా చూచాడు. వాడికొక మంచి ఆలోచన తట్టింది. వాడూ కుర్రవెధవ. అందులో కాస్త పోకిరీరకం. పైగా ఎండలో ఐస్‌క్రీమ్ బండితోసి బాగా అలసిపోయి ఉన్నాడు.

"అబ్బాయ్, ఈ ఐదుపైసలు నీ దగ్గరే వుంచుకో. పొద్దుణ్ణించి బండి తోయలేక చస్తున్నాను. నాతోపాటు నాలుగువీధులు కాస్త బండితోస్తూ తిరిగావో, నీకు నాలు గణాల ఐస్‌క్రీమ్ పాకెట్ ఇచ్చేస్తాను." అన్నాడు వాడు.

నాలుగణాల ఐస్‌క్రీమ్! రామూ ఎగిరి గంతేశాడు. తన అయిదు నయాపైలు బిళ్ళా జేబులో వేసుకుని, బండి వాడితోపాటు బండి తొయ్యటానికి సిద్ధమయ్యాడు. బండి కదిలింది. బండి కుర్రాడు బండిభారంలో ఎక్కువభాగం రామూమీద వదిలేసి, బీడీ ముట్టించి "ఐస్‌క్రీం ఐస్‌క్రీం" అంటూ కేకలు పెట్టసాగాడు. రామూకు ఉత్సాహం ఆగింది కాదు. రామూకూడా బండివాడి గొంతులో గొంతు కలుపుతూ "ఐస్‌క్రీం ఐస్‌క్రీం" అంటూ అరవసాగాడు.

బండి మరో వీధికి మళ్ళింది. అక్కడా పిల్లలు బండి చుట్టూ పోగయ్యారు. వాళ్ళంతా ఐస్‌క్రీమ్ తింటూంటే రామూ సంతోషం పట్టలేక, "తినండి తినండి! బలేవుంది గదూ?" అంటూ వాళ్ళను ఉత్సాహపరుస్తూ తను తినా లన్న కోర్కెను మాటల్తో తీర్చుకొంటున్నాడు.

ఒకటి రెండుగంటలు గడిచిపోయాయి. బండివాడు నాలుగువీధులూ తిరిగేస్తున్నాడు. పోయినకొందికీ బండిభారం రామూమీద ఎక్కువ వదులుతున్నాడు బండివాడు. రామూ ఆయాసపడుతున్నాడు. జారిపోతున్న లాగును మధ్య మధ్య ఎడంచేత్తో పైకి లాక్కుంటున్నాడు. కాళ్ళూ చేతుల్లూ చచ్చుబడిపోతున్నాయి. ముఖం అలసటతో కందిపోయింది. చెమటతో తడిచిన రామూ ముఖం వర్షంలో తడిచిన గులాబి పువ్వులా వుంది.

తినబోయే ఐస్‌క్రీమ్ తాలూకు అనుభూతి రామూకు కొత్త ఉత్సాహాన్ని ఇస్తోంది. కాని వాడు ఆ ఇస్తానన్న ఐస్‌క్రీమ్ ఎంతకూ ఇవ్వండే!

సూర్యాస్తమయమయింది. క్రమంగా చీకటి కమ్ము కుంటోంది. ఐస్‌క్రీమ్‌కోసం పిల్లలెవరూ పరుగెత్తుకు రావటం లేదు. బండి బస్‌స్టాప్ దగ్గర వున్న వినాయకుడి గుడి దగ్గరగా వచ్చింది. త్వరగా తొయ్యమని హెచ్చరించాడు బండివాడు రామూను.

రామూ ఆపాదమస్తకం దుమ్ముకొట్టుకొని, చెమటలు కారుస్తూ ఆయాసపడుతున్నాడు— రామూకు బండివాడి మీద కోపం వచ్చింది.

“ఉఁహుఁ ఇక నేను బండితొయ్యను. నా ఐస్‌క్రీమ్ నాకిచ్చెయ్యి” అన్నాడు రామూ బండిని వదిలేస్తూ మొండికెత్తినట్టు.

“అయితే ఇదిగో తీసుకో” ఆ అవకాశం కోసమే ఎదురుచూస్తున్న బండికుర్రాడు అలా ఐస్‌క్రీమ్ తీసి రామూ కేసి విసురుతూ, బండితోపాటు గబగబా ముందుకెళ్ళిపోయాడు.

రామూ ఐస్‌క్రీమ్‌ను అందుకోలేకపోయాడు. ఐస్‌క్రీమ్ దుమ్ములో పడిపోయింది. రామూ కొయ్యబారిపోయి దుమ్ములోపడి నీరుగా మారిపోతున్న ఐస్‌క్రీమ్‌నే చూస్తూ నిల్చున్నాడు. రామూ దూరంగాపోతున్న బండివాడికేసి, దుమ్ములో కలిసిపోతున్న ఐస్‌క్రీమ్ కేసీ చూస్తూ నిలబడ్డాడు. వంగి ఐస్‌క్రీమ్‌ను దుమ్ములోనుంచి తియ్యటానికి ప్రయత్నించిన రామూ చేతికి పట్టిపుల్ల వచ్చింది. దానివైపే ఒక్క క్షణంచూసి కోపంగా విసిరికొట్టాడు. ఏడుపు వచ్చింది. ఇంటికేసి బయలుదేరాడు. బాగా అలసిపోయిన శరీరమూ కాళ్ళు

ఈడ్చుకుంటూ నడుస్తున్నాడు. అలా నడుస్తున్న రాము వినాయకుడి గుడిముందు తన ఇష్టదైవం గుడిముందు యాంత్రికంగా ఆగిపోయాడు. బండివాడిమీద కోపమంతా వినాయకుడి మీద మళ్ళింది.

"నువ్వసలు ఏమీ బాగుండవ్? పెద్దబొజ్జా, ఏనుగ ముఖం, నువ్వసలకు మంచిదేవుడివే కాదు" అన్నాడు రామూ పైకి వినాయకుడికి వినిపించాలన్నట్లు. ఓ క్షణం వినాయకుడికేసి కన్నార్పకుండా చూస్తూ నిలబడ్డాడు. "హిఁహిఁహిఁ" వినాయకుణ్ని గేలిచేస్తున్నట్లు నవ్వాడు.

"ఎవరైనా గుర్రాన్ని ఎక్కుతారు — ఏనుగును ఎక్కుతారు — ఎలిక నెక్కుతారా ఎక్కడన్నా! గుర్రం అయినా లేని నువ్వేం దేవుడివి. నీకు అసలు ఏమీ చేతకాదు. ఆ ఐస్‌క్రీమ్‌గాడి నడ్డి విరగ్గొట్టటంకూడా చాతకాదా చూస్తూ కూర్చున్నావ్! నీకన్న మా అమ్మ దేవుడిగూట్లోవున్న వెంకటేశ్వరస్వామి ఎంతో బావుంటాడు! ఎంత చక్కగా పూలదండ వేసుకొని నిల్చుంటాడో! చాలా మంచివాడు. పెద్ద దేముడు. వెంకటేశ్వరస్వామికి అమ్మతెచ్చే టపాకాయలు ఇస్తాను. నీకు ఒక్కటికూడా ఇవ్వను.

రామూకు మతాబాల గుర్తుతో బాటు ఇల్లూ, కొత్తనాన్న అన్నమాటలు గుర్తుకొచ్చాయి. గుండెలు దడదడలాడాయి. ఒక్కసారి వినాయకుడికేసి కోపంగా చూసి ఇంటి వైపుకు పరుగుతీశాడు రాము. కొత్తనాన్న ఈ పాటికి తిరిగివచ్చి వుంటే! అమ్మ బాబోయ్ రామూ పడుతూలేస్తూ పరుగెత్తుతున్నాడు.

"వెంకటేశ్వరస్వామీ! నువ్వు మంచి దేవుడివి. అమ్మవాళ్ళు ఇప్పుడప్పుడే రాకుండాచెయ్యి స్వామీ! నేను వెళ్ళి గడపలమీద కూర్చున్నాక అమ్మా, కొత్తనాన్నా వచ్చేలా చెయ్యి!" పరుగెత్తుతూనే ప్రార్థించాడు రామూ. ఆ పసివాడి ఆర్తనాదం, ఎత్తుగా చాలా ఎత్తుగా, ఏడు కొండలమీద నిల్చొనివున్న ఆ వెంకటేశ్వరస్వామి చెవుల్లో పడిందో లేదో ఆ స్వామికే తెలియాలి.

రొప్పుతూ రోజుతూ రాము ఇంటిముందు కొచ్చేసరికి, ఇంటి తలుపులు బార్లా తెరచిఉన్నాయి. కొత్తనాన్న రానేవచ్చాడు అనుకున్న రాము పైప్రాణాలు పైనే పోయాయి. భయంతో వణికిపోతూ కాసేపు మెట్లదగ్గరే నిలబడి, తరువాత పిల్లిలా అడుగులో అడుగు వేసుకుంటూ లోపలికి వెళ్ళాడు.

లోపల కొత్తనాన్న ఎదురైన దానికంటే అధికంగా రాము బెదిరిపోయాడు. ఇంట్లో సామానంతా చిందర వందరగా పడేసిఉంది. అమ్మ చీరలబీరువా బార్లా తెరచి ఉంది. ఖాళీ బీరువా బోసిగాచూసింది రాము ముఖంలోకి.

జరిగిందేమిటో అర్థం చేసుకోవటానికి రాము పసి మనస్సు నానా యాతనపడింది. "దొంగలు" అన్నభావం మనస్సులోకి రాగానే రామూ కొయ్యబారిపోయాడు. ఎదురుగాఉన్న వెంకటేశ్వరస్వామి ఫొటోకేసి అదోలా చూశాడు. నామాలతో కళ్ళు కప్పేసివున్న వెంకటేశ్వర స్వామి రామూ చూపులోని భావాన్ని చూడగలిగితే సిగ్గు పడిపోయే వాడేనేమో! రెప్ప వాల్చకుండా రామూ వెంక

ఈశ్వరస్వామినే చూస్తున్నాడు. కళ్ళు తిరిగినట్లయితే స్వామి కదిలినట్లయింది. కాని ఆ కదిలిందీ కనిపించిందీ స్వామికాదు కొత్తనాన్న! బెల్టు చేత్తోపట్టుకొని, నిప్పు కణాలలాంటి కళ్ళతో తనకేసే వస్తున్నాడు కొత్తనాన్న ?

"అమ్మా?" అంటూ ఒకపెద్ద కేకపెట్టి ఇంట్లోంచి బయటకుదూకి, కాలి సత్తువకొద్దీ పరుగెత్తసాగాడు రామూ, వీధిమలుపు తిరిగాడు. మెయిన్ రోడ్డుకేసి వెళ్ళే బజారు వెంటబడి పరుగెత్తసాగాడు. బస్‌స్టాండు దాటాడు. వినాయకుడి గుడిముందు ఒక క్షణం ఆగి చెంపలు వేసుకొని ముందుకు పరుగెత్తాడు. పరుగెత్తుతున్నాడు. ఆ వెనకవున్న గుట్టలూ, మిట్టలూ దాటాడు. పాడుపడ్డ దేవిడికేసి పరుగెత్తుతున్నాడు.

రామూ బాగా అలసిపోయాడు. ఇక పరుగెత్తే శక్తి లేదు. రెండు నిముషాలు నిల్చున్నాడు. గట్టిగా ఊపిరి తీస్తున్నాడు. ఎదురుగా చీకట్లో చెట్లు. గుబురుచెట్లు, చింపిరి తలలు పిచ్చివాళ్ళలా కనిపించాయి. రాము గుండెలు దడదడ కొట్టుకున్నాయి. కాళ్లు వణుకుతున్నాయి. అక్కడ వుండే దెయ్యాలను గురించి బళ్ళో పిల్లలు చెప్పిన విషయాలు గుర్తొచ్చాయి.

అమ్మబాబోయ్! ఎన్ని దెయ్యాలో! వెనక్కు తిరిగి పరుగెత్తా లనుకున్నాడు. కాని అలాగే కొయ్యబారి నిల్చున్నాడు. శరీరంలో ఏభాగం కదలటంలేదు. చెట్ల మధ్యనుంచి ఒక ఆకారం కదిలి తనవైపుకు వస్తున్నట్టు కన్పించింది రామూకు. రామూ ఊపిరి బిగిసిపోయింది.

"అమ్మబాబోయ్! దెయ్యమే! తన్ను పీక్కు తింటానికి వస్తోంది. ఎంత పెద్ద పెద్ద కోరలో! మోకాళ్ళు వెనక్కూ, మో చేతులు ముందుకూ...అంతా సాగేష్ చెప్పినట్లేవుంది. దగ్గర కొచ్చేస్తోంది."

వెనక్కు తిరిగి పరిగెత్తాలంటే భయం వేసింది. దెయ్యం దగ్గిరవుతోంది. రామూ వళ్ళంతా చెమటలు పట్టింది. ఊపిరి తిత్తులు ఎవరో బలంగా నొక్కి వేసినట్లయింది. "అమ్మో దెయ్యం" అంటూ గావుకేక పెట్టి విరుచుకు పడి పోయాడు రాము.

దెయ్యం ఆకారం ముందుకువంగి పడిపోయిన రామును రెండు చేతులతో పైకెత్తింది. మిలమిలా మెరిసే కళ్ళతో రామూ ముఖంలోకి ఓ క్షణం దీక్షగాచూచి గుండె లకు హత్తుకొంది.

పూర్తిగా స్పృహ తప్పని రామూకు తనను దయ్యం పట్టుకొన్నట్లు తెలుస్తూనేవుంది. గట్టిగా కాళ్ళూ చేతులూ విదిలించాడు.

ఆ ఊపుకు బక్కచిక్కిన ఆకారం కాలు నిలదొక్కు కోలేక, రామూతో పాటు అల్లంత దూరం పోయి బండరాతి మీద దభీమంటూ పడిపోయింది.

మర్నాడు రెండుబారల పొద్దెక్కిం తరవాత ఒకానొక పిచ్చివాడి రెండు బాహువుల్లో యిమిడి అతని గుండెలకు హత్తుకునివున్న రామూను జనం చూచారు. ఇద్దర్లో జీవం లేదు. పిచ్చివాడికి తగిలిన గాయంనుంచి కారిన రక్తం,

రాముూ ముఖంమీాద గడ్డకట్టి వున్నది. కొంతసేపటికి సుహా సిని ఏడుస్తూ అక్కడికి వచ్చింది. లక్ష్మీపతికూడా వెంట వున్నాడు. పిచ్చివాడు కామేశ్వర రావని ఇద్దరూ గుర్తిం చారు.

లక్ష్మీపతి రాముూను కామేశ్వరరావు కౌగిట్లోంచి లాగబోయేసరికి, సుహాసిని ఒక వెర్రికేక పెడుతూ లక్ష్మీపతి చేతిమీాద బలంగాకొట్టి, వెనక్కు విరుచుకు పడిపోయింది.